ఆచార్యులవారి హిరణ్యకశిపుడు

సముద్రాల వేంకట రాఘవాచార్యులు

శ్రవ్యకావ్యాలు గుణాగుణ విచక్షణులైన వ్యాఖ్యాతలచేత ప్రకాశిస్తవి. అట్లాగే సమర్థులైన నటకులచేత దృశ్యకావ్యాలుకూడా. భావుకుడైన విమర్శకుడు కావ్యరచనంలో కవి వూహించని భావాలు తన ప్రతిభాశక్తివల్ల కల్పించి కావ్యాని కందమూ, కవికి గౌరవమూ కూరుస్తాడు. నాటకవిషయంలో నటునిశక్తిగూడా అలాగంటిదే. ఈ శక్తుల సాహచర్యంవల్లనే అనేకకావ్యాలు నేడు నూతనసౌందర్యంతో ప్రకాశిస్తున్నవి. చాలామంది వ్యాఖ్యాతలు, నటులు చరితార్థజీవనులైనారు.

అలాగంటి ఉత్తమశాఖకు చేరిన నటవర్గంలో నాట్యకళాప్రపూర్ణ తాడిపత్రి రాఘవాచార్యులుగా రొకరు. అనేక సంవత్సరాలుగా ఆంధ్రదేశం అన్ని భాగాలలోను అద్వితీయమూ, ఆదర్శప్రాయమూ అయిన తమ నాట్యప్రాగల్భ్యన్ని ప్రకటిస్తూవున్న ఆచార్యులవారిని గురించి ప్రత్యేకంగా ప్రశంసించ పనిలేదు. వారికి నాటకాల్లో వేషాలువేయడం ఒకవృత్తిగాదు. అంటే పొట్టకోసం ఆపని చేయడంలేదన్నమాట. దానివల్ల అఖండమైన యశస్సుసంపాదించాలనే కోరికగూడా వున్నట్టు కన్పించదు. కాని బాల్యంనుంచీ వారి జీవితంలో నాట్యం ఒక భాగమైపోయింది. అది జన్మతః వారిలో విస్ఫూర్తివహించిన ఒకమానవగుణంగా మారిపోయింది. చివర కది వారికి పూర్తిగా వశమై నూతనవైలక్షణ్య ప్రతిపాదనానికి తోడుపడింది. స్వభావసిద్ధమూ, అప్రయత్నలబ్ధమూ అయిన నాట్యం వారిలో ప్రాచీప్రతీచీవిజ్ఞానసంసర్గంవల్ల విప్పారిన ఉపజ్ఞతో బలపడి కళోపాసనకు, కళాసిద్ధికి దారితీసింది.

వారు తమనాట్యోత్సాహాన్ని ఒక్క తెలుగుకే అంకితంచేయలేదు. ఇంగ్లీషు, కన్నడం, హిందీ భాషల్లోకూడా నటించడం వారికి పరిపాటే. సర్వతోముఖంగా వికసిస్తూవున్న ఆ నాట్యకళలో, తెలుగునాటికి సంబంధించిన తెలుగునాటకాల్లో వారి ప్రహ్లాద నాటకానికి ప్రధానస్థానం ఇవ్వాలి. ఆ నాటకంలో వారు ధరించే హిరణ్యకశిపుపాత్రం ఆచార్యులవారి కళాసిద్ధికి మచ్చుముక్క. అంతేకాదు, వారి హిరణ్యకశిపుడు తెలుగువారికి ఒక నూతనసృష్టి.

ప్రాచీనస్వరూపం

హిరణ్యకశిపుడంటే ఆచార్యులవారి అభిప్రాయమేమిటో చెప్పేముందు అంతకుమునుపు తెలుగువారెట్లా ఆ ఆకారస్వభావాలు భావిస్తున్నారో సంగ్రహించడం మంచిదనుకొంటాను. దానికి ఆంధ్రుల వాఙ్మయమూ, వారినాట్యప్రదర్శనాలకంటే మరోసాక్ష్యం అఖ్ఖర్లేదు.

భాగవతం (పోతనామాత్య విరచితం)లో హిరణ్యకశిపు వర్ణనచూస్తే నిజంగా రాక్షసవర్ణనే. ఆ స్వరూపాన్నే సమీకరించుకొని సిద్ధయోగిగారు, తిరునగరి రామానుజయ్యగారు వారి ప్రహ్లాదనాటకాలు వ్రాశారు. వాటిల్లో ప్రదర్శితమవుతూవున్న హిరణ్యకశిప స్వరూపం ఆంధ్రులు గ్రహించుకొన్నరూపం.

సిద్ధయోగి విరచితమైన ప్రహ్లాదనాటకం జయపతాకంగా "కూచిపూడిభాగోతులు" దక్షిణ భారతమంతా జైత్రయాత్ర చేశారు. పండితులు, పామరులు అందరూ ఆనాటకప్రదర్శనాన్ని అభినందించారు. వారినాటకంలో మనకు కన్పించే హిరణ్యకశిపుడు శుద్ధతమోగుణ సంపన్నుడు; చండశాసనుడు. దయా, క్షమా, అనురాగం కంచుకాగడాబెట్టి వెతికినా అతనిలో కనపడవు. సమస్త ప్రపంచంలోనూ అతనికి కన్పించేవి స్వప్రతిష్ఠా, ప్రతాపమూ—అంతే. ఒకటేపరుగులు, గంతులు, అరపులు, కేకలు—ఇవి అభినయపద్ధతులు. వాటికను గుణమైన నాట్యం అక్కడక్కడా ఉపలక్షితమవుతూవుంటుంది. ఆకారంచూచినా అలాగంటిదే. ఏస్సైతానో, లేక భూతమో అవతరించినట్లుంటుంది. రాక్షసుడంటే వారిఅభిప్రాయం అలాగంటిది.

ఇక నాట్యకళా ప్రపూర్ణుని అభిప్రాయం చెపుతాను. ఇదికూడా వారిప్రదర్శనంవల్ల బహిర్గతమయ్యేదే. ఆచార్యులవారి హిరణ్యకశిపుడు మానవుడు. అతనిలోకూడ వివిధమనః ప్రవృత్తులున్నాయి. భార్యాబిడ్డలయందు అనురాగమమకారా లున్నాయి. క్షమవుంది. పశ్చాత్తాపముంది. బ్రహ్మవర ప్రసాదలబ్ధమైన పరాక్రమంతోబాటు సంక్రమించిన మాఢ్యమూ, స్వాతిశయమూ అతనిలోవుండే లోట్లు. ఇతని చండశాసనత్వం అఖండంకాదు. దానికి పట్టువిడుపులున్నాయి.

ఈ లక్షణాలు పాత్రప్రదర్శనంలో ఎలా పోషింపబడ్డాయో కూడా విచారిద్దాం.

నాటక ప్రారంభంలో హిరణ్యకశిపుడు బ్రహ్మనుగూర్చి తపస్సుచేసి బ్రహ్మనుగ్రహం సంపాదించడం ప్రదర్శింపబడుతుంది. ఈ దృశ్యంలో ఆచార్యులవారు సాత్త్వికమైన భక్తి యోగాన్నే ప్రదర్శిస్తారు.

తరువాతరంగంలో వరోపార్జిత బలప్రదర్శనం. స్వప్రతాపమోఘీకృతులైన దిక్పాలుల్ని బందీకృతుల్నిచేసి వారిని ఆజ్ఞాబద్ధులను చేయడంలో నాట్యకళాప్రపూర్ణులు ఉత్తరంగితమైన వీరరౌద్రరసాలను హద్దులుదాటకుండా ప్రదర్శిస్తారు. అప్పటి వారి స్వరూపం అగాధగంభీర సముద్రంలావుండి ప్రేక్షకుల్ని వడికిస్తుంది. అరుపులు లేవు, బొబ్బలు లేవు, గంతులులేవు, కత్తిసాములులేవు. ఒకటేపద్యం, నాలుగైదు వాక్యాలు. అభినయమంతా ఆ విశాలనేత్రాలలో గొంతునిండి బహిర్గమించే కంఠస్వనంలో ముద్రితం.

ఇక ముందంతా సంసారకథ. రంగం స్వగృహం. పాత్రలు హిరణ్యకశిపుడు, పెండ్లాము, కొడుకు, సేవకులు, గురువులు.

పసిబిడ్డడైన ప్రహ్లాదుడు పసిడితొట్టిలో నిద్రపోతుంటే ముద్దాడతాడు హిరణ్యకశిపుడు. కుమారుని నారాయణస్మరణ కలవరింతగా భావించి కొడుకును కుస్తరిస్తాడు. అమాయికునిలాగు ఆమాటలు వద్దని కొడుక్కి బోధిస్తాడు. దీనితో అతడిలోనూ, నాటకంలోనూ అంతర్ద్వంద్వం ప్రారంభమవుతుంది. ఇక్కడినుంచే ఆచార్యులవారి కళావిస్ఫూర్తికూడా విజృంభిస్తుంది. ఇలాగంటి అంతర్ద్వంద్వాలలోనే నటుని నాణెం తెలుస్తుంది. ఒకప్రక్క తనముద్దుకొడుకు; రెండవప్రక్క తన కాజన్మవిరోధియైన హరిస్మరణ. ఒకవంక అవ్యాజమైన అనురాగం; మరొకవంక మరలింపరాని మహాసూయ. ఈ రెండిటిని మేళగించి దిద్దితీర్చి, నాటకాంతంవరకు తీగెలు సాగిస్తారు నాట్యకళాప్రపూర్ణులు.

తరువాతిదశ తనకుమారుని విచిత్రచరిత్రపట్ల ఆందోళనం. అతిమానుషమైన ప్రహ్లాదుని వర్తనం హిరణ్యకశిపుడి మనస్సులో అనేకపరివర్తనాలు కలిగిస్తుంది. అద్భుతం దాని ఫలితం. అద్భుతభావాభినయంకూడా అద్భుతమే.

కుర్రవాడు బడికిపోతే బుద్ధిమారుతుందని బడికి పంపించాడు. ఆరునెలలుగడిచాయి. తల్లికి కుమారుడిమీద మనసుపోయింది. "నామమాత్రం పగా?" అని హిరణ్యకశిపుడు ఇంటికి పిలిపించాడు. ఎదురుబోయి కొడుకు నెత్తుకొని తీసికొచ్చి తనతొడమీద కూర్చుండబెట్టుకొని "చోద్యంబయ్యెడి ఎంతకాలమరిగెన్.........పద్యంబొక్కటి చెప్పి సార్థముగ తాత్పర్యంబు భాషింపుమా" యని కోరునప్పటి అనురాగం, ఉపలాలనరీతి, విరహంలోని బాధాతీవ్రత పుత్రవంతులైన తలిదండ్రుల కడుపులు కలగించి హిరణ్యకశిపుడికి ప్రేమ ఎంత తెలుసునని పిస్తారు. "అన్నా ఎన్నడు నీవు నీతిమతివౌ దంచున్ మహావాంఛతో నున్నాడన్ ననుగన్న తండ్రి!" అనేపద్యంలో పుత్రప్రేమ పొంగులెత్తుతుంది. హరితత్త్వమే సారమని కొడుకు తేల్చినప్పుడు "ఈ దానవశ్రేణికిన్ వైకుంఠుండు కృతాపరాధుడతనిన్ వర్ణింప నీకేటికిన్" అని అధిక్షేపిస్తూ అదేవాక్యం రెండుమూడుసార్లు అభినయించేటప్పుడు విష్ణువుచేత తనతమ్ముడు మరణించినందుకు ప్రతిహింస, రాక్షసజాతిఅంతా హతమైనందుకు భయము, తానుమాత్రము జయించగలనా అన్ననిరుత్సాహం త్రివేణిలాగు కేంద్రీకరింపబడతవి. శుక్రకుమారుడే యీ చదువు నేర్పివుంటాడని నిర్ణయించుకుని అతణ్ని "కటకట బ్రాహ్మణాకృతివిగాక యథార్థపు బ్రాహ్మణుండవే" యని సాసూయాతిరస్కారంగా, ఖండితంగా, సంగీతార్ద్రితారహితంగా నిందించే ధోరణి, ఆచూపురూపు, నేటిప్రబల బ్రాహ్మణేతర నాయకులనుగూడా "ఓహో" అనిపిస్తుంది.

బెదిరింపులు లాభించలేదు. చరమోపాయమే శరణమయింది. "అస్మదీయంబగు నా దేశమున గాని మిక్కిలి రవి మింట మెరయవెరచు, విచ్చలవిడి గాలి వీవవెరచు, శమనుండు ప్రాణుల జంపవెరచు, ఏల వెరవవు పలువ నీకెవరు దిక్కు" అని గద్దించాడు. తన బలప్రతాపాలు విప్పిచెప్పాడు. ప్రయోజనంలేదు. పర్వతంమీదినుంచి త్రోయించాడు; చావలేదు. తిరిగివచ్చాడు. పశ్చాత్తాపం కలిగింది. తన దుష్కార్మానికి నొచ్చుకుంటాడు. ఈ పశ్చాత్తాపాభినయం యథార్థంకంటె అర్థవత్తుగా నటిస్తారాచార్యులుగారు.

తన పశ్చాత్తాపం భ్రాంతిఅని తేలింది. పిల్లవాడు చిన్నవాడైనా పట్టుకోతిపట్టు. ఏ విధంగానూ వీడు బ్రతుకరాదు. నానా మారణవిధానాలు ప్రయత్నించాడు; చావలేదు. సేవకులు చంపలేదేమో అన్న సంశయంతో తానే స్వయంగా చంపడానికి పూనుకున్నాడు. హాలాహలంవంటి విషం కన్నబిడ్డకు గిన్నెలోపోసి అందించడం ఎవరు చేస్తున్నా చూడలేం. ప్రాణం తరుక్కుపోతుంది. తానే స్వయంగా చేయాలి. నటనైనా యథార్థాన్ని కప్పిపుచ్చేలా గుండాలి. అప్పటి తండ్రి హృదయబాధ, ఆ కంపం, ఆ భయం ఆచార్యులుగారు చక్కగా చిత్రిస్తారు.

కుర్రవాడు ఇప్పటికీ చావలేదు. మానవుని హింసాశక్తిమాత్రము చచ్చింది. ఇది కథలో, పాత్రలో మరొక నూతనదశను పాదుకొల్పుతుంది. బాలుడు మానవమాత్రుడుకాడు, దివ్యుడనే సంశయం బయలుదేరింది. మూఢహృదయంలో అవ్యక్తమైన కారణవివేకం పొడసూపింది. ఆలోచనపైఆలోచన. చివరకి అడుగుతాడు బహిరంగంగా నీ వెందుకు చావవని. మాధవుశ్ని చూపమంటాడు. నాటకంలో చివరిఅంకమూ, పాత్రపోషణంలో చివరిదృశ్యమూ, సంఘటనముకూడా ఇదే. తానదివరకు అనేకసార్లు ప్రపంచమంతా గాలించాడు. ఎక్కడా

విష్ణువుచిక్కలేదు. చిక్కినా వాణ్ణి హతంచేసి తనసర్వేశ్వరత్వం నిలబెట్టుకోవచ్చు. చివరిఎత్తు. కట్టితే దీంతో ఆటకట్టితీరాలి. ఈ కృతనిశ్చయత్వం నాట్యకళాప్రపూర్ణులు, ఆత్మవిశ్వాసం ఉట్టిపడేలాగు, గాంభీర్యం తొణకకుండా నటిస్తారు.

నృసింహసాక్షాత్కారము, హిరణ్యకశిపు మరణంతో నాటకం తుది. యుద్ధం అభినయించరాదు గనక ఆచార్యులుగారు పట్టి మరణంతోనే నాటకం ముగిస్తారు.

ముగింపు

సంప్రదాయప్రకారం చెప్పాలంటే విష్ణుభక్తులకీ, విష్ణుద్వేషులకీ మధ్య జరిగే సంఘర్షణం అని చెప్పాలి ఈ నాటకోదంతాన్ని. యథార్థానికిది తానే సర్వశక్తుణ్ణి, కర్తనూ అనుకొనే మూర్ఖహృదయానికి, మానవాతీతమైన మహోదివ్యశక్తి ప్రపంచకర్త అనుకొనే హృదయానికిగల పోరాటంగా కన్పిస్తుంది. ఈ వుద్దేశ్యమే మనస్సులోపెట్టుకొని ఆచార్యులవారు నటిస్తున్నారేమోనని నావూహ. ఈప్రయత్నంలో నాట్యకళాప్రపూర్ణులది అఖండవిజయమేనని చెప్పాలి. ఈ పాత్రాభినయంలో అనేక రసప్రకటనాలు ఒకటేమూసలోపోసి కరగి హిరణ్యకశిపు పాత్రను తయారుచేసి ఆంధ్రులకి అర్పించారు. ఆ సృష్టి ప్రాచీనపాత్ర స్వరూపంకంటే వినూతనంగా వుందని పైప్రస్తావమంతా తెలియజేస్తుంది. అక్షరశః దానిలో సరి క్రొత్తదనం వుందని నేను చెప్పను. కాని పాత్రయొక్క అంతస్స్వభావంలోమాత్రం నూతనవైలక్షణ్యం ప్రతిపాదింపబడిందనడంలో సాహసంలేదు. అది ఆచార్యులవారి నాట్యకళావిజ్ఞానం, రంగస్థలానుభవం, సారస్వతపరిణతి పూచి, ఫలించినపండు. దానికి ఆంధ్రులు కృతజ్ఞులై స్వాగతం చెపుతున్నారు. కాని వ్యక్తిగతాలైన కొన్నిసంశయాలు నాకున్నవి. కశ్యపుని సంతతివాడు హిరణ్యకశిపుడు. తండ్రిమత మేమో నాకు తెలియదుగాని, హిరణ్యకశిపుడుమాత్రం దానవున్ని సాధారణంగా అనుకునేటట్టు తిర్యక్పుండ్రధారునిగా తయారుచేస్తారు. మొదటిదశలో తనకంటే దేవుడు వేరేఒక డున్నాడని తలచిన హిరణ్యకశిపుడు సంప్రాప్తబ్రహ్మవరుడైనతరువాత, దివ్యలోకజైత్రయాత్రచేసినపిమ్మట, తానే దేవుణ్ణి అనుకుంటాడని కథవల్ల తెలుస్తోంది. అందుకనె సమస్తయజ్ఞాలు తనకేవుద్దేశించి చేయమంటాడు. అలాగంటి స్థితిలోకూడా ఆ తిర్యక్పుండ్రం ధరించడం ఆ సిద్ధాంతానికి ఒదుగుతుందా అని నా సంశయం. మరో అంశం. ఇది సంప్రదాయప్రకారం అనుసరింపబడితే, హిరణ్యకశిపు పాత్రధారణం ఏ మాత్రం భయంకరంగా లేకుండా కంసుడులాంటి ఏ దుష్టరాజువేషంలాగో ఎందుకువేయాలి సంప్రదాయ విరుద్ధంగా అనేది మరొక అనుమానం.

ఇక అభినయంవిషయంలో పద్యాలు తగ్గించాలి వీలైనంతవరకు సంభాషణ వచనంలో వుండాలి అనే అభిప్రాయానికి విలువ ఈయబడుతూందే ఈ రోజుల్లో, ఆచార్యులవారు కొండవీటిచేంతాడువంటి సీసపద్యాన్ని అందుకుని చివరిదృశ్యంలో ఎందుకు అభినయిస్తున్నారు తెలియదు. గ్రంథకర్తను యథావస్థితంగా అనుసరిస్తున్నామంటే వారి ప్రదర్శనంలో తీసివేసిన భాగాలు, కాలావసరాన్నిబట్టి వీలువెంట తగ్గించుకొనేభాగాలు, దృశ్యాలకుదృశ్యాలేవుంటయి. అలాగంటప్పుడు పైసమాధానం పొసగదు. అందువల్ల అలాగంటి అభినయాలు ప్రత్యేకసమాధానం కోరుతవంటాను.

ఏతావతా, ఇలాగంటివి మరికొంచెం సంస్కారం పొందితే ఈ పాత్రలో ఆచార్యులుగారిది అమోఘవిజయమే. ఈ పాత్రలో వారి అభినయానికంటె పాత్రప్రదర్శనంలో కలిగిన నూతనత్వం చూపడం నా వుద్దేశం. అభినేతలను విమర్శించడం కాదు. ఏంచేయబోయి ఏం చేశానో !

Source: Press Academy Website, Natya Kala, Dec 1934

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan